

రైతాంగాన్ని అప్రమత్తం చేయాలి

జిల్లా వ్యవసాయ శాఖ సంచాలకులు వై.రామకృష్ణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రస్తుత తుపాను పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతాంగాన్ని అప్రమత్తం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ సంచాలకులు వై.రామకృష్ణ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన మండలంలోని చిగురుకోట, ముదినేపల్లి గ్రామాల్లో పర్యటించి తుపానుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల ద్వారా పొలాల్లోని వర్షపు నీరు బయటకి పోయేలా కాలువలు బాగు చేసేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ పి.మల్లేశ్వరి, సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి, మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ పాల్గొన్నారు.

మిచౌంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు జిల్లాను ముంచెత్తాయి. 24 గంటల పాటు ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లు కుంభవృష్టి వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా సరాసరిన 37.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లాకేంద్ర ప్రభుత్వాసుపత్రి నీటమునిగింది. లక్షలాది ఎకరాల్లో పంటలకు ముప్పు ఏర్పడింది. ధాన్యపురాశులు తడిసిముద్దయ్యాయి. వరి, మొక్కజొన్న, పత్తి, పొగాకు పంటలు నేలకొరిగాయి. కోతలు పూర్తయిన వరి పనలు నీటిలో తేలియాడుతున్నాయి. నారుమడుల్లోకి మోకాళ్లలోతు నీరు చేరింది. చేతికొచ్చిన పంటలు దెబ్బతినడంతో అన్నదాతలు కన్నీరుపెడుతున్నారు.



జీలుగుమిల్లి మండలంలో నీటిలో తేలుతున్న వరి పనలు

కుంభవృష్టి..!

- జిల్లావ్యాప్తంగా 37.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- జిల్లాలో లక్ష ఎకరాల్లో వరిపంటకు ముప్పు
- తడిసిముద్దయిన ధాన్యపు రాశులు
- నేలకొరిగి నీట మునిగిన వరి
- పొగాకు, వేరుశనగ పంటలకు దెబ్బ
- రోడ్లు, పల్లపు ప్రాంతాలు జలమయం
- నీటమునిగిన ఏలూరు ప్రభుత్వాసుపత్రి
- పలుచోట్ల కంట్రోల్‌రూములు ఏర్పాటు
- తీరం దాటిన తుపాను

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మిచౌంగ్ తుపాను జిల్లాను నిండాముంచేసింది. సోమవారం సాయంత్రం నుండి మంగళవారం సాయంత్రం వరకూ జిల్లావ్యాప్తంగా కుంభవృష్టి వర్షం కురిసింది. సరాసరిన 37.9 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. అత్యధికంగా ముదినేపల్లిలో 135.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జనం ఇంటినుంచి అడుగుబయట పెట్టే పరిస్థితి లేకుండాపోయింది. జనజీవనం స్తంభించింది. ముఖ్యంగా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లావ్యాప్తంగా 1.93 లక్షల ఎకరాల్లో రైతులు



ఉంగుటూరు మండలంలో..



ఆగిరిపల్లి మండలంలో..

వరిసాగుచేయగా ఇప్పటి వరకూ 90 వేల ఎకరాల్లో మాత్రమే మాసూళ్ళు పూర్తయ్యాయి. లక్ష ఎకరాల్లో పంట పొలాల్లోనే ఉండిపోయింది. ఎడతెరిపిలేని వర్షానికి లక్ష ఎకరాల్లో పంటకు ముప్పు ఏర్పడింది. పొలాల్లో మోకాళ్లలోతు నీళ్లు నిలిచాయి. ఈదురుగాలులకు పలుచోట్ల పంటలు నేలకొరిగాయి. కోతకోసిన వరి పనలు నీటిలో తేలియాడుతున్నాయి. రోడ్లపైన, కల్లాలో ఉన్న ధాన్యపురాశులు తడిసిముద్దయ్యాయి. ధాన్యం మొలకలు వచ్చే పరిస్థితి ఏర్పడింది. మెట్టప్రాంతమైన జీలుగుమిల్లి మండలంలో సైతం వరిపంటలు నీటమునిగాయి. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.35 వేలకుపైగా ఖర్చుచేశారు. ప్రస్తుత పరిస్థితి చూస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. చేతికొచ్చిన దక్కకుండా పోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బాపట్ల వద్ద తుపాను తీరం దాటినప్పటికీ మరో 48 గంటలపాటు తుపాను ప్రభావం ఉండనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. మరోవారంరోజుల వరకూ కోతలు కోసే పరిస్థితి కనిపించడంలేదు. దీంతో పంటంతా కుళ్లిపోయే ప్రమాదం ఉంది. మెట్ట ప్రాంతంలో పొగాకు పొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. దాదాపు 20వేల ఎకరాల్లో పొగాకు సాగవుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. వర్షాలకు వేరుశనగ పంటకు సైతం తీవ్ర నష్టం వాటిల్లింది. కోసిన పంట తడిసిముద్దవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

టార్పాలిన్లు లేక రైతుల అవస్థలు

వర్షానికి తడవకుండా ధాన్యపు రాశులను కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన టార్పాలిన్లు అందించడంలో విఫలమైంది. దీంతో ధాన్యపు రాశులపై ఎన్ని బరకాలు కప్పినప్పటికీ గింజలు తడిసిపోతున్నాయి.

నీట మునిగిన నారుమడులు

రబీ పంటకు సంబంధించి వేసిన నారుమడులు ఎక్కడికక్కడే నీటమునిగాయి. నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు వంటి పలు మండలాల్లో రైతులు నారుమడులు పెద్దఎత్తున వేశారు. వర్షానికి మోకాళ్ల లోతు నీళ్లు పొలాల్లోకి చేరాయి. దీంతో రెండోసారి నారుమడులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడనుందని రైతులు లబోదిబోమంటున్నారు.



పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలంలో సుడిగాలి బీభత్సానికి బోల్తాపడిన వ్యాన్

పల్లపు ప్రాంతాలు జలమయం

తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. పలు కాలనీలు నీటమునిగి ఇళ్లల్లోకి నీరు చేరింది. జిల్లా కేంద్రం ఏలూరులో రోడ్లపై మోకాళ్లలోతు వర్షపునీరు నిలిచిపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికిలో వర్షపునీరు చేరడంతో సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కంట్రోల్ రూములు ఏర్పాటు

తుపాను నేపథ్యంలో పలు చర్యలు చేపట్టిన అధికారులు జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు.
కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం టోల్ ఫ్రీ నెంబర్ 18002331077,
న్యూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయం- 18656-232717,
జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం - 9553220254
ఏలూరు ఆర్‌డిఒ కార్యాలయం - 8500667696



తడిసిన ధాన్యం మద్దతు ధరకు కొనాలి

సిపిఎం, ఎపి రైతుసంఘం, వ్యకాస డిమాండ్

ప్రజాశక్తి - దెందులూరు

మిచౌంగ్ తుపాను వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం, ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొవ్వలి, దోసపాడు గ్రామాల్లో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సిపిఎం, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మంగళవారం పర్యటించారు. కల్లాల్లో బరకాలు కప్పిన ధాన్యాన్ని, నేల వాలిన వరి పంటను పరిశీలించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. రైతులు ఆందోళనకు స్పందించిన మండల అధికారులు ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.కిషోర్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకష్ణ మాట్లాడారు.

తుపాను వల్ల తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని కోరారు. ధాన్యం తడిసిపోకుండా పంటను రక్షించుకునేందుకు తగిన టార్పాలిన్లను ప్రభుత్వం సరఫరా చేయలేదని చెప్పారు. వాహనాలు తగినంతగా ఏర్పాటు చేయకపోవడం వల్ల కల్లాల్లోనే ఉండిపోయిందన్నారు. కొనుగోలు నిబంధనలు సవరించి తడిసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కోరారు. పంటల బీమా వర్తింపచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంతగాని అనందరావు, చౌలముడి ఏసుభక్తి, డి.రామకృష్ణ, మోజేస్, రాజు, కడిమే కిరణ్, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

తక్షణం ధాన్యం మిల్లులకు చేర్చండి : కలెక్టర్

ప్రజాశక్తి - పెదపాడు

ధాన్యం తరలించే అవకాశాలున్న చోట ఆలస్యం చేయకుండా తక్షణం మిల్లులకు చేర్చాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రైతులకు సూచించారు. మండలంలోని సీతారామపురం, వట్లూరు గ్రామాల్లో భారీ వర్షాలకు మునిగిన పంటలను జెసి బి.లావణ్యవేణితో కలిసి మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంత రైతులతో కలెక్టర్ వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ఆదుకుంటుందని, అధైర్యపడొద్దని భరోసా కలిగించారు. కల్లాల్లో ఉన్న ధాన్యం ఆర్‌బికెల ద్వారా ఆఫ్‌లైన్ పద్ధతిలో మిల్లులకు తరలించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఖరీఫ్ ధాన్యాన్ని పూర్తిస్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందొద్దన్నారు. సీతారామపురం రైతులు కల్లాల్లో భద్రపరచిన ధాన్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ప్రస్తుత పంట పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పంట నష్టానికి పరిహారం అందేలా చూడాలని, సబ్సిడీపై విత్తనాలు సరఫరాకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం వట్లూరులో నేలకొరిగిన వారి పంటను పరిశీలించారు. అక్కడ పంట పరిస్థితిని వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి సమయంలో మిల్లర్లు రైతులకు అండగా నిలవాలన్నారు. కలెక్టర్ వెంట ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మంజుభార్గవి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆళ్ల సతీష్‌చౌదరి, తహశీల్దార్ విజయ్‌కుమార్, వ్యవసాయశాఖ ఎడి వై.సుబ్బారావు, వ్యవసాయాధికారి వి.ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



నేలవాలిన వరిపైరును పరిశీలిస్తున్న కలెక్టర్

రైతులకు అండగా ఉండాలి

సమన్వయంతో పనిచేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - భీమడోలు

తుపాను బాధిత రైతులను ఆదుకునేందుకు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కోరారు. రైతుల పరిస్థితి స్వయంగా పరిశీలించేందుకు కలెక్టర్ మంగళవారం భీమడోలు మండలంలో పర్యటించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న ప్రతిధాన్యపు గింజనూ సేకరించాలని అధికారులకు సూచించారు. సడలించిన నిబంధనలకు అనుగుణంగా ధాన్యం సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలి, వ్యవసాయాధికారి ఉషారాజకుమారి, భీమడోలు సర్పంచి సునీతామాన్‌సింగ్, తహశీల్దార్ ఇందిరా గాంధీ, పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

మిచౌంగ్ బాధితులను ఆదుకోవాలి : సిపిఎం

ఏలూరు అర్బన్: జిల్లాలో రెండు రోజులుగా మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను, ఇళ్లు కోల్పోయిన కుటుంబాలను, వరద ముంపునకు గురైన నిరాశ్రయులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో 37 మిల్లీమీటర్లకుపైగా వర్షపాతం నమోదవడంతో పొలాలు, పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయనీ, ఫలితంగా వరి, పత్తి, పొగాకు తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. జిల్లాలో లక్షా 90 వేల ఎకరాల్లో వరి నాట్లు వేయగా ఇప్పటికీ 89 వేల ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయని, వీటిల్లో 20 వేల టన్నుల ధాన్యం నేటికీ కొనుగోలు కాలేదని తెలిపారు. ప్రభుత్వం తుపాను సందర్భంగా అప్రమత్తమయ్యేందుకు తగు చర్యల్లో భాగంగా రైతులు ధాన్యాన్ని రక్షించుకునేందుకు అవసరమైన బరకాలు సరఫరా చేయలేదన్నారు. 15 శాతంలోపు తేమ పేరుతో కొనుగోలు చేయకుండా తాత్సారం చేశారని, ఇదే రీతిగా వర్షాలు కొనసాగితే మిగిలిన పంట కూడా నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతుల వద్ద నుండి పంటను కొనుగోలు చేసి ఉంటే ఈ నష్టం తగ్గేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దెబ్బతిన్న పంటలను తేమ శాతంతో సంబంధం లేకుండా కొలుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాలకు పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయని, దీంతో చాలా చోట్ల ఇళ్లు పడిపోయాయని, చాలావరకూ దెబ్బతిన్నాయని తెలిపారు. జిల్లాకేంద్రం ప్రభుత్వాసుపత్రిలోకే వర్షపు నీరు చేరుకుందని, ఆ నీటిని తోడేందుకు సిబ్బంది ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. ఈ వర్షాలతో వ్యవసాయ కార్మికులు, అసంఘటితరంగ కార్మికులకు పనుల్లేక, ఉపాధి దెబ్బతిని తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇళ్లు కూలిపోయిన, దెబ్బతిన్న కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని, ఉపాధి కరువైన వారికి నిత్యావసర సరుకుల పంపిణీ, నగదు సహాయం చేయాలని కోరారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని, ఆ ప్రదేశాల్లో వసతులు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశాలున్నందున వైద్య సహాయ చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క రైతులను, మరోపక్క ప్రజలను ఆదుకొనేందుకు యుద్ధప్రాతిపదికన తగిన ఏర్పాట్లు చేయాలని ఈ ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఏలూరు ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

ఏలూరు: జిల్లాకేంద్ర ప్రభుత్వాసుపత్రి, నగరంలో పలు వీధులు వర్షాలకు ముంపునకు గురికాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలో జలమయమైన వీధుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ కొద్దిపాటి వర్షానికే వీధులన్నీ జలమయమవుతున్నాయన్నారు. భారీవర్షం కురిస్తే జిల్లా ఆసుపత్రి, కలెక్టర్ కార్యాలయం వంటివి కూడా మునిగిపోతున్నాయన్నారు. ఆర్‌ఆర్.పేట, పవర్‌పేట, కొత్త పేట, శివారు ప్రాంతాల్లో ఇందిరమ్మ కాలనీలు ముంపునకు గురవుతున్నాయన్నారు. వీటికి శాశ్వత పరిష్కారం చూపాలని ఎంఎల్ఎ ఆళ్ల నానిని, నగర పాలకవర్గాన్ని వర్గాన్ని కోరారు.

వర్షార్పణం..!

ప్రజాశక్తి - మండవల్లి

మిచౌంగ్ తుపాను మండలాన్ని అతలాకుతలం చేసింది. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. లింగాల, అల్లినగరం, కానుకొల్లు, అయ్యావారి రుద్రవరం గ్రామాల్లో సుమారు రెండు వేల ఎకరాల్లో మినుము పంట పూర్తిగా నీట మునిగింది. లింగాల, అల్లినగరంలోని ధాన్యపు రాశులు తడిసి ముద్దయ్యాయి. ఇంగిలి పాక లంక వద్ద చెట్లు విరిగి రోడ్డుపై పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

జంగారెడ్డిగూడెం : మండలంలో కోతకొచ్చిన వరిచేలు నేల వాలాయి. ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పేరంపేట, పంగిడిగూడెం, లక్కవరం, దేవులపల్లి తదితర ప్రాంతాల్లో వరిచేలు నేలవాలాయి. పట్టణంలో అంతర్గత రోడ్లు చెరువులను తలపించాయి. కళాశాల రోడ్డులో కాకర్ల జంక్షన్ వద్ద డ్రెయినేజీ పొంగి రోడ్డుపై మురుగనీరు రోడ్డుపైకి చేరడంతో అధ్వానంగా తయారైంది.

ఉంగుటూరు : మండలంలోని కొత్తగూడెం, తిమ్మయ్యపాలెంలో ధాన్యం రాశుల చుట్టూ వరద నీరు మూడు అడుగుల మేర చేరింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

జీలుగుమిల్లి: మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో మండలంలో రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రహదారులు జలమయమయ్యాయి. వాగులు పొంగిపొర్లుతున్నాయి. జీలుగుమిల్లి - బర్రింకలపాడు రహదారి మధ్యలో ఉన్న అశ్వారావుపేట



మండవల్లిలో..

వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. వంకవారిగూడెం వద్ద కాలువ ఉధృతంగా రోడ్‌పై నుంచి ప్రవహించడంతో గిరిజన గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వరి, వేరుశనగ, పొగాకు పంటలు నీట మునిగాయి. చేతికొచ్చిన పంటలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ముదినేపల్లి : తుపానుకు మండలం అల్లకల్లోలంగా మారింది. భారీ వర్షాలు, భీకర గాలులకు ప్రజలు భయందోళనకు గురయ్యారు. జనజీవనం పూర్తిగా స్తంభించింది. పలుచోట్ల తోపుడు బండ్లు, చిరు వ్యాపారుల గుడిసెలు ఈదురు గాలులకు ఎగిరిపోయాయి. హోర్డింగులు, ఫ్లెక్సీలు ధ్వంసమయ్యాయి. ముదినేపల్లి సెంటర్‌లోని సినిమా థియేటర్, హోటళ్లు మూతపడ్డాయి.

జిల్లాలో వర్షపాతం ఇలా..

జిల్లాలో 24 గంటల్లో వ్యవధిలో 37.9 మిలీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మండవల్లి మండలంలో 135.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా కుక్కునూరులో 12 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముదినేపల్లిలో 133.2, కలిదిండి 57.6, కైకలూరు 56.2, పెదపాడు 45.6, ఏలూరు 38.4, కొయ్యలగూడెం 36.8, భీమడోలు 34.2, పెదవేగి 33.8, దెందులూరు 32.6, జంగారెడ్డిగూడెం 31.8, ఆగిరిపల్లి 30.6, ఉంగుటూరు 30.2, నూజివీడు 30.2, నిడమర్రు 30, జీలుగుమిల్లి 29.6, ముసునూరు 29.4, చాట్రాయి 28.4, లింగపాలెం 25.8, టి.నరసాపురం 25.2, కామవరపుకోట 24.6, బుట్టాయగూడెం 22.0, ద్వారకాతిరుమల 20, పోలవరం 19.2, చింతలపూడి 18.4, వేలేరుపాడు మండలంలో 12 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

చింతలపూడి : మండలంలో వరిపంట రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. కోతకు వచ్చిన పంట నేలపాలు కావడంతో రైతులు కన్నీరుపెడుతున్నారు. ఇటీవల వరకూ వర్షాల్లేక కొన్నిచోట్ల వరి పంటలు ఎండిపోయాయి. మరికొన్ని చోట్ల ఉన్నకొద్దిపాటి నీటితో కాపాడుకుంటూ వచ్చిన పంటలు కాస్తా ప్రస్తుత వర్షానికి నాశనమయ్యాయి. ఈదుగాలులకు పలుచోట్ల మొక్కజొన్న నేలవాలింది.

నేడు విద్యా సంస్థలకు సెలవు : కలెక్టర్

ఏలూరు: మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలుల నేపథ్యంలో ఈ నెల ఆరో తేదీ బుధవారం అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు, కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. వర్షాలు ఏకధాటిగా కురుస్తున్నందున ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు తప్పనిసరిగా ప్రభుత్వం ఇచ్చే సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

ఆగిరిపల్లి : మండలంలో మిచౌంగ్ తుపాను



కలిదిండిలో..

- అన్నదాతను ముంచిన మిచౌంగ్ తుపాన్
- ఏకధాటిగా వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నేలకొరిగిన కోతకొచ్చిన వరి
- తడిసి ముద్దయిన ధాన్యపు రాశులు
- దెబ్బతిన్న పొగాకు, మొక్కజొన్న, పత్తి, మినుము పంటలు

వర్షాలకు వరి, మినుము, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంటలు చేతికొచ్చే సమయంలో వర్షాలు ముంచెత్తడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వివిధ దశల్లో ఉన్న వరిపంటకు అపారనష్టం వాటిల్లింది. మినుము, పత్తికి బూజు వచ్చే ప్రమాదం ఉంది. మామిడిపూత మాడిపోయే పరిస్థితులన్నాయని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. పంటలు



ఏలూరు ఆర్‌ఆర్‌పేట..

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదు కోవాలని సిపిఎం మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు డిమాండ్ చేశారు.

ముసునూరు : అన్నదాతను మిచౌంగ్ తుపాను నట్టేముంచింది. వరి, పత్తి, మొక్కజొన్న, పొగాకు, మిర్చి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆయా పొలాల్లోకి భారీగా వర్షపునీరు చేరడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు నానాఅవస్థలు పడుతున్నారు. ఎటు చూసినా పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లు జలమయమయ్యాయి. రోడ్లపై ఉన్న భారీగోతుల్లోకి వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

పోటెత్తిన ఉప్పుటేరు

కలిదిండి : తుపాన్ ప్రభావంతో మండలంలోని ఉప్పుటేరు పోటెత్తింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉప్పుటేరుకు కలిసే ప్రధాన డ్రెయిన్‌లు ఎగదన్నడంతో పల్లపు ప్రాంతాల్లోని వర్షపునీరు పారుదలలేక నెమ్మదించాయి. స్థానిక లాల్వా డ్రెయిన్‌కు ఉప్పుటేరు నీరు ఎగదన్నింది. బస్టాండ్ సమీపంలో రాష్ట్రీయ రహదారిపై, కోట కలిదిండికి వెళ్లే ఇరు మార్గాల్లో మోకాళ్ల లోతు వర్షపు నీరు చేరింది. సర్పంచి ఎం.మారుతీ ప్రసన్న వెంకటేశ్వరరావు నీటి తొలగింపు చర్యలు చేపట్టారు. బస్టాండ్ వెనుక చెరువు నిండి రోడ్లపైకి నీరు చేరింది. సమీప ఇళ్లల్లోకి నీరు చేరింది. గ్రంథాలయం చుట్టూ నీరు చేరింది. ఆక్వా చెరువులు నిండుకుండల్లా ఉన్నాయి. గట్లు తెగిపోతే తీవ్రనష్టం వాటిల్లుంతుందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు.



జంగారెడ్డిగూడెం మండలంలో నేలకొరిగిన వరిపైరు

ఏలూరు అర్బన్: మిచౌంగ్ తుపాను కారణంగా మంగళవారం ఉదయం నుంచి ఏలూరు నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నగరంలోని రోడ్లు, డ్రెయిన్లు జలమయమయ్యాయి. తంగెళ్లమూడి, ఆదివారపుపేట, పవర్‌పేట, ఆర్‌ఆర్.పేట, ఎన్ఆర్.పేట, పత్తేబాధ, అశోక్‌నగర్, అమీనాపేటలతో పాటు వన్ టౌన్‌లోని పలు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. డ్రెయిన్లు పొంగిపొర్లడంతో రోడ్లు, డ్రెయిన్లు ఏకమై మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. పత్తేబాద రైతు బజార్ పూర్తిగా నీటమునిగింది. ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంతోపాటు ఆసుపత్రి లోపలికి కూడా వర్షం నీరు చేరడంతో మోటార్లతో నీటిని తోడాల్సి వచ్చింది. డిఇఒ కార్యాలయం, రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు వర్షం నీటితో నిండిపోయాయి. ఇండోర్ స్టేడియం మైదానం నీటితో నిండింది.

నూజివీడు రూరల్ : తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని ఎపిఎస్ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణ జలమయమైంది. మోకాళ్లలోతు నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మరుగుదొడ్ల వద్ద ఉన్న డ్రెయినేజీ పూడుకుపోవడంతో వర్షపు నీరు వెళ్లే దారి లేక బస్టాండ్ ఆవరణ మొత్తం నీటమునిగింది.

విద్యుత్ పరికరాల వద్ద అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలతో విద్యుత్ పరికరాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎలక్ట్రికల్ ఇఇ ఎ.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ మోటార్లు ఆపరేటింగ్ చేసే విషయంలో రైతులు పొడి గుడ్డలను వినియోగించాలన్నారు. ఇంటి వద్ద బట్టలు ఆరబెట్టే సమయంలో విద్యుత్ వైర్లు తగలకుండా చూసుకోవాలని తెలిపారు. విద్యుత్ సమస్యలపై 1912 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.


వర్షంలో వృద్ధురాలిని పలకరిస్తున్న బడేటి

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో బడేటి పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మిచౌంగ్ తుపాను దాటికి అతలాకుతలమైన ప్రాంతాల్లో ఏలూరు టిడిపి ఇన్‌ఛార్జి బడేటి రాధాకృష్ణ పర్యటించారు. తుపాను బాధితులను పరామర్శించారు. తమ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టిడిపి నేతలు, కార్యకర్తలు తుపాను బాధితులకు అండగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో జిల్లా ఆసుపత్రిలో పరిస్థితిని సమీక్షించారు. ఆసుపత్రి అంతా కూడా వరద నీటితో మునిగిపోయి ఉండడాన్ని గమనించారు. దీంతో అక్కడ ఉన్న వరద నీటిని ప్రహరీ గోడకు అవతలివైపు ఎత్తిపోసి నిరసన తెలిపారు. స్థానికంగా ఉండే ఎంఎల్ఎ ఆళ్ల నాని గతంలో ఆరోగ్య మంత్రిగా చేసినా ఏలూరు ఆసుపత్రికి చేసిందేమి లేదని, ఈ కారణంగానే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ఆసుపత్రి సిబ్బందితో కలిసి ఫ్లోర్‌ను శుభ్రం చేశారు. రోగుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు.

పత్తి రైతులకు అపార నష్టం

ఉపాధి కోల్పోయిన రోజువారీ కూలీలు

ప్రజాశక్తి - చాట్రాయి

గత రెండు రోజులుగా తుపాను కారణంగా కురుస్తున్న వర్షానికి క్రాసింగ్ పత్తి సాగు చేస్తున్న రైతులకు అపార నష్టం వాటిల్లిందని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం తెలిపారు. రోజూవారి కూలీపై ఆధారపడి జీవించే కూలీలు తమ ఉపాధిని కోల్పోయారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా తుపాను కారణంగా కురుస్తున్న అకాల వర్షానికి ఎంతో పెట్టుబడి పెట్టి, కూలీలతో ప్రతిరోజు క్రాసింగ్ చేస్తూ సాగు చేస్తున్న క్రాసింగ్ పత్తి రైతులకు అపార నష్టం కలిగిందని, ప్రతిరోజు క్రాసింగ్ జరిగితేనే పంట ఉత్పత్తి అవుతుందని తెలిపారు. గత రెండు రోజులుగా క్రాసింగ్ చేయకపోవడం వలన ఉత్పత్తి తగ్గిపోయి, నష్టం వాటిల్లి రైతులు అప్పుల పాలు అవుతున్నారని వాపోయారు. కూలీలు అకాల వర్షం కారణంగా తమ ఉపాధిని కోల్పోయి గృహాలకే పరిమితమై, కూలీ పనులకు వెళ్లక కూలీ డబ్బులు చేతికి రాక చాలీచాలని జీవనం గడుపుతున్నారని తెలిపారు. వరి ధాన్యం ఆరబెట్టుకునేందుకు కల్లాల్లో ఉంచిన ధాన్యం వర్షం కారణంగా తడవటంతో ధాన్యం రేటు తగ్గిపోతుందని అలాంటి రైతులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. మొక్కజొన్న మొలకెత్తే దశలో ఉన్నటువంటి మొక్కజొన్న పైరు వర్షం కారణంగా నీరు నిల్వ ఉండటంతో మొక్క తడిసి మొలకెత్తకుండా మొక్కజొన్న రైతులకు నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వ వ్యవసాయ అధికారులు తక్షణమే మండలంలో క్రాసింగ్ పత్తి, వరి, మొక్కజొన్న పంటలు పరిశీలించి, నష్టం అంచనా వేసి రైతులకు నష్టపరిహారం ఇచ్చే విధంగా ప్రభుత్వానికి నివేదిక అందించాలని, రైతులను ఆదుకోవాలని కోరారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసంగి రాజు

సంక్షేమ పథకాల అమలుకు కృషి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సచివాలయల ద్వారా జరిగే సంక్షేమ పథకాల అమలుకు సిబ్బంది మరింతగా కృషి చేయాలని జిల్లా ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ప్రసంగి రాజు పేర్కొన్నారు. మండలంలోని సచివాలయ సిబ్బందికి రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమంలో భాగంగా మంగళవారం రెండో రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయల ద్వారా ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అదేవిధంగా సిబ్బంది పనిచేసే సమయంలో ఒత్తిడికి గురి కాకుండా పారదర్శకంగా పని చేయాలని సూచించారు. అనంతరం కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌వేర్ ప్రాబ్లమ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కృష్ణప్రసాద్, అడ్మినిస్ట్రేషన్ అధికారిని మంగతాయారు, ఇఒపిఆర్‌డి నిఖిల్ సాయి శరణ్, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

ఐటిడిఎ వద్ద గిరిజనుల రిలే దీక్షలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

కోట రామచంద్రపురం గిరిజన సమీకృత ఐటిడిఎలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మర్లగూడెం గ్రామం గిరిజనులు రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షల్లో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మర్లగూడెం గ్రామస్తులు సాగు చేసుకుంటున్న భూముల్లోని గిరిజనేతరులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారన్నారు. ఎల్‌టిఆర్, 1/70 గిరిజన ప్రాంతంలో ఈ చట్టాలను కాపాడాల్సిన ప్రభుత్వాలే కాలరాస్తున్నాయని తెలిపారు. ఎల్‌టిఆర్ భూముల్లో గిరిజనేతరులు అక్రమంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా ఆర్‌డిఒ ప్రొడక్షన్ ఆర్డర్లు ఇవ్వడం ఏవిధంగా కరెక్టు అని వాపోయారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు భూస్వాములకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టం అమల్లో ఉన్నా అధికారులు ఇష్టానుసారంగా ప్రొడక్షన్ ఆర్డర్లు ఇవ్వడం తగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు, మడకం వెంకటేష్, శ్రీదేవి, వెంకటలక్ష్మి, నాగమణి, రాములమ్మ, చిలకమ్మ, రోజా పాల్గొన్నారు.

నిత్యావసరాలకు అనుగుణంగా పింఛన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా అర్హులైన వయోవృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, విభిన్న ప్రతిభావంతులకు పింఛన్ పెంచాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య జిల్లా కమిటీ సభ్యురాలు మడకం మంగ అన్నారు. కమ్యూనిస్టు పార్టీ పిలుపు మేరకు స్థానిక ఎంపిడిఒ ఎస్.వేణుగోపాల్ రెడ్డికు పలు డిమాండ్లతో కూడిన వినతిని సిపిఐ మండల కార్యదర్శి కారం దారయ్య ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరిమితంగా పెరుగుతున్న నిత్యావసరాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జీవన వ్యయానికి తగు విధంగా అన్ని రకాల పెన్షన్లను పెంచాలని ఆమె కోరారు. కళాకారులు, తదితర సంక్షేమ పెన్షన్‌దారులందరికీ పెన్షన్ నెలకు రూ.6 వేలు, విభిన్న ప్రతిభావంతులకు రూ.7 వేలు పెంచి అందించాలని తెలిపారు. 2007 తల్లితండ్రుల పోషణ, వృద్ధుల సంరక్షణ చట్టాన్ని సక్రమంగా అమలు చేసి తగు రక్షణ కల్పించాలన్నారు. అదేవిధంగా వివిధ పెన్షన్లు పొందుతున్న వారందరికీ రైళ్లల్లోనూ, ఆర్‌టిసి బస్సుల్లోను ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని, అందుకు తగిన పాస్లు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు మడకం మంగ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మడకం దుర్గారావు, తెల్లం వీరమ్మ, పోలోజు సుబ్రమణి, కంగాల వెంకాయమ్మ, తామ వెంకమ్మ పాల్గొన్నారు.

సచివాలయాల సేవలు వినియోగించుకోవాలి

ఉంగుటూరు ఎంఎల్ఎ వాసుబాబు


అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామ పరిపాలనను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ముఖ్యమంత్రి గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని, దాని సేవలు వినియోగించుకోవాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు కోరారు. ఆయన మండలంలో మంగళవారం పర్యటించారు. దీనిలో భాగంగా భీమడోలు గ్రామంలో రూ.74.30 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను ఇతర ప్రముఖులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాల ఫలాలు నేరుగా చేరుతున్నాయని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుకు విత్తనం ఎంపిక నుంచి సాగు పూర్తి చేయటం, ఆ తర్వాత పండించిన ఉత్పత్తులకు మద్దతు, గిట్టుబాటు ధరను కల్పించటం, సదరు మొత్తాలను వారి ఖాతాలకు నేరుగా జమ చేయడం వంటి కార్యక్రమాలు వివిధ శాఖల సమన్వయంతో జరుగుతున్నాయని వివరించారు. ధాన్యం తరలించే విషయమై రైతులకు హమాలీ ఛార్జీలు, రవాణా ఛార్జీలు భారం లేకుండా పోయిందన్నారు. తుపాను నేపథ్యంలో ధాన్యం సేకరణకు ప్రభుత్వం కొన్ని సడలింపులు ఇచ్చిందని, వాటి సేవలు వినియోగించుకోవాలని కోరారు. ఇదేవిధంగా తుపాను నేపథ్యంలో ధాన్యం సేకరణ, చేపట్టవలసిన కోతల విషయమై రైతులు ఇబ్బందులను అధిగమించేందుకు వారికి తగు సదుపాయాలు వారి బడ్జెట్‌లోనే సమకూర్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు తమ వంతు సహకారాన్ని అందజేస్తారని తెలిపారు. రైతులు తోలిన ధాన్యానికి ప్రస్తుతం 60 గంటల లోపు వారి ఖాతాలకు సొమ్ములు జమవుతున్నాయని వివరించారు. ఇదేవిధంగా మండలంలో గత 15 రోజులుగా కోతలు ప్రారంభమయ్యాయన్నారు. గతంతో పోల్చుకుంటే రైతులను ఆదుకునేందుకు మద్దతు ధరను ప్రభుత్వం పెంచిందని, ఇతర సదుపాయాలు కల్పించిందని వివరించారు. వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా సైతం తగు సేవలు అందుబాటులో వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సలహా మండలి జిల్లా ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి తుమ్మగుంట భవానీ రంగా, సర్పంచి పి.సునీత మాన్సింగ్, సొసైటీ అధ్యక్షులు ఆర్.సత్యశ్రీనివాస్, వైసిపి ప్రముఖులు రామకుర్తి నాగేశ్వరరావు, భీమడోలు పంచాయతీ కార్యదర్శి ఎస్.ఠాగూర్ పాల్గొన్నారు.

పరిహారం అందేలా తక్షణ చర్యలు : ఎంఎల్ఎ

ముంపు పొలాల పరిశీలన

ప్రజాశక్తి - కైకలూరు

కైకలూరు ప్రాంతంలో తుపాను వల్ల నష్టపోయిన రైతులను, ఇతర బాధితులకు తక్షణమే ప్రభుత్వ సాయం అందేలా కృషి చేస్తానని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన గోపవరంలో నీట మునిగిన పంట చేలను జెడ్‌పి సిఇఒ సుబ్బారావుతో కలిసి పరిశీలించారు. బాధిత రైతులకు అండగా ఉంటామని చెప్పారు. ఆయన వెంట ఎంపిపి అడవి కృష్ణ, తహశీల్దార్ మురళీకృష్ణ, వ్యవసాయాధికారి దివ్య, సర్పంచి ఉలిసి వసంత కుమారి, పెంచికలమర్రు సర్పంచి జయమంగళ కాసులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


కైకలూరు:నీటమునిగిన చేలను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షం ఎక్కువగా ఉన్నందున రైతులు పల్లపు ప్రాంతంల్లో నీరు చేరకుండా జెసిబితో గాడి తీసి నీరు పంపే ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిపారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ఎప్పటికప్పుడు పరిస్థితిని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నామని రైతులకు సూచించారు.

ముసునూరు: తుఫాను ప్రభావంతో ఏ రైతు నష్టపోకూడదనే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ధాన్యం నిల్వ ఉంచకూడదని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నట్లు ట్రెయినీ కలెక్టర్ శ్రీపూజ, తహశీల్దార్ దాసరి సుధ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చెక్కపల్లి, లోపూడి గ్రామాల్లోని వరి పంటలను పరిశీలించి, రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని ధాన్యం కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలియజేశారు.

బుట్టాయగూడెం : ప్రస్తుతం మిచౌంగ్ తుపాన్ తీరం దాటడం వల్ల తుపాన్ ప్రభావంతో పడుతున్న అధిక వర్షాల పట్ల ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టాలు జరగకుండా ప్రజలను, రైతులను అప్రమత్తం చేసి నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయం నుంచి ఐటిడిఎ పిఒ, ఆర్‌డిఒ, నియోజకవర్గంలోని ఎంఆర్‌ఒలు, ఎంపిడిఒ, పోలీస్, వ్యవసాయాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, కల్వర్టు, వాగుల వద్ద హెచ్చరిక బోర్డులు, పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తేమ శాతం పట్టించుకోకుండా ధాన్యం మొత్తం కొనుగోలుకు ఆదేశాలు ఇచ్చినందున రైతులు ఎవ్వరూ అధైర్య పడకుండా వారితో మాట్లాడి పంట నష్ట పోకుండా తగు చర్యలు సూచించాలని, కోసిన పంటను, ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా వైసిపి అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు అందరూ ప్రజలకు అందుబాటులో ఉండి, ఎక్కడైనా సమస్యలు ఉంటే స్థానిక అధికారుల సమన్వయంతో ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని పిలుపునిచ్చారు.


చాట్రాయి:ధాన్యం రాశులు పరిశీలిస్తున్న ఎడి, తహశీల్దార్


టి.నరసాపురం:ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ అద్దయ్య

టి.నరసాపురం: తుఫాను కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులు అధైర్య పడొద్దని, ప్రభుత్వం అండగా వుంటుందని జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎ.అద్దయ్య తెలిపారు. మండలంలోని టి.నరసాపురం, ఎపి గుంట, బొర్రంపాలెం గ్రామాల్లో నిల్వ వుంచిన ధాన్యం రాశులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిల్వ వుంచిన ధాన్యం తడవకుండా బరకాలతో కప్పాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున వరి, వేరుశనగ కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. ఏదైనా పంట నష్టం జరిగితే అధైర్య పడకుండా స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జెవి. సుబ్బారావు, వ్యవసాయాధికారి డి.ముత్యాల రావు, విఆర్‌ఒలు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని చాట్రాయి, జనార్ధనవరం, ఆరుగొలను పేట గ్రామాల్లో కల్లాల్లో ఆరబెట్టిన వరి ధాన్యాన్ని మంగళవారం చాట్రాయి మండల తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావు, వ్యవసాయ శాఖ అధికారి శివశంకర్ పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని వెంటనే సంచుల్లోకి ఎత్తుకొని భద్రపరుచుకోవాలని, తుపాను కారణంగా వరి కోతలు కోయకుండా ఆపివేయాలని, వరి ధాన్యం తడిసినట్లయితే 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసినట్లయితే ధాన్యం మొలకెత్తకుండా ఉంటుందని తెలిపారు. రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.


చింతలపూడి:ధాన్యం రాశులు పరిశీలిస్తున్న తహశీల్దార్

చింతలపూడి: రైతులు ధాన్యం తడవకుండా పరదాలు కప్పాలని, అదేవిధంగా నీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చింతలపూడి తహశీల్దార్ కృష్ణజ్యోతి, మండల వ్యవసాయాధికారి మీనాకుమారి అన్నారు. పట్టణంలో పాత చింతలపూడి సమీపంలో టార్పాలిన్స్‌తో కప్పి ఉంచిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ

చాట్రాయి: రైతు భరోసా కేంద్రాలలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో పచ్చిధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడం జరుగుతుందని ఎప్పటికప్పుడు కోసిన ధాన్యాన్ని వెంటనే రైతు భరోసా కేంద్రానికి తీసుకువెళ్లి అమ్ముకోవాలని వ్యవసాయ శాఖ అధికారి బి. శివశంకర్ రైతులకు తెలిపారు.


నీటమునిగిన ఇళ్లను పరిశీలిస్తున్న విఆర్‌ఒ

గొల్లగూడెంలో కూలిన ఇళ్లు

ప్రజాశక్తి - ఉంగుటూరు

భారీ వర్షాలకు ఉంగుటూరు మండలం గొల్లగూడం ఎస్‌సి కాలనీలో తాటాకిళ్లులు, పెంకుటిళ్లులు కూలిపోయినట్లు విఆర్‌ఒ ఉండ్రాజవరపు చంద్రబాబు వెల్లడించారు. బాధితులను పునరావాస కేంద్రానికి తరలించి వారికి భోజన, వసతి ఏర్పాట్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి యాళ్ల కిషోర్‌బాబు, వైసిపి గ్రామ నాయకుడు మలకపల్లి నాగు క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితులకు సహాయ చర్యలు చేపట్టారు.

108లో ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏలూరు వారి విభాగాలలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో 108 ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల, ఏలూరు పరిధిలో ఆరు కేటగిరీలలో 17 పోస్టులు, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, ఏలూరు పరిధిలో పదిహేడు కేటగిరీలలో 81 పోస్టులు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏలూరు పరిధిలో ఐదు కేటగిరీలలో 10 పోస్టులు ఉన్నాయన్నారు. అర్హతగల అభ్యర్థులు https://westgodavari.ap.gov.in, https://eluru.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సిందిగా తెలిపారు. దరఖాస్తును డౌన్లోడ్ చేసుకుని, దరఖాస్తుతో పాటు తమ విద్యార్హతలు, ఉద్యోగార్హతల జిరాక్స్ సెట్‌ని ఏదైనా గెజిటెడ్ అధికారి ద్వారా ధృవీకరించబడింది అయి, ప్రిన్సిపల్ ప్రభుత్వ వైద్య కళాశాల ఏలూరు కార్యాలయంలో ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సమర్పించవలసిందిగా తెలియజేశారు.

ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలి

ప్రజలు అవసరమైతే తప్ప ఇంటిని వదిలి బయటికి రావద్దు

బలహీనంగా వున్న ఏటిగట్లు, వంతెనలు, తదితర ప్రాంతాల్లో

ముందస్తు జాగ్రత్త చర్యలకు అధికారులకు ఆదేశాలు జారీ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మిచౌంగ్ తుఫాన్ కారణంగా కురుస్తున్న విస్తార వర్షాలు, ఈదురు గాలుల పట్ల ఆగిరిపల్లి మండల ప్రజలు అప్రమత్తంగా వుండాలని, ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు కోరారు. మండలంలోని తోటపల్లి-చిన్నాగిరిపల్లి మధ్యగల కంపెనీ వాగు ఉధృతిని ఆయన వర్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావద్దని, అత్యవసర సమయంలో సహాయక కేంద్ర హెల్ప్‌లైన్లకు ఫోన్ చేయాలని, కరెంటు వున్నపుడే సెల్‌ఫోన్‌లు ఛార్జింగ్ పెట్టుకోవాలని, పంటపొలాల్లో మోటారు స్విచ్‌లు వేయవద్దని సూచించారు.


ఏటిగట్టును పరిశీలిస్తున్న ఎస్ఐ

గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కైకలూరు

గ్రామాల్లో ప్రతి పేదవాని గడపకూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అడవి వెంకటకృష్ణ మోహన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాలలో జరగవలసిన, చెయ్యాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రతి గ్రామాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తూ ముందుకు వెళుతున్న ముఖ్యమంత్రి జగన్‌ను మరోమారు సిఎం చెయ్యడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామాలకు కేటాయించిన నిధులను ఉపయోగిస్తూ త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి కురేళ్ల బేబీ, మండల పార్టీ అధ్యక్షులు భట్రాజు శివాజీ, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు బలరామరాజు, జెడ్‌పి సిఇఒ, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ సుబ్బారావు, ఎంఆర్‌ఒ మురళీకృష్ణ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మత్స్యశాఖ అధికారులు, పిహెచ్‌సి వైద్యులు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

ఆసుపత్రి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో వర్షపు నీటి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చేపడతామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. భారీ వర్షాల కారణంగా ముంపుకు గురైన ప్రాంతాలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రి సుమారు ఏడు, ఎనిమిది దశాబ్దాల క్రితం నిర్మించిన కట్టడమని, లోతట్టు ప్రాంతంలో ఉండడంతో తరచూ భారీవర్షాలు, వరదల సమయంలో ఆసుపత్రి పరిసరాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. ప్రస్తుతం ఆసుపత్రి వైద్యాధికారులు ఆసుపత్రి ప్రాంగణంలో చేరిన వర్షపు నీటిని మంగళవారం ఉదయం నుంచి మోటారుతో బయటకు పంపుతున్నారన్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి తగిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపి, చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రానున్న రెండు రోజులపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని, మండలస్థాయిలో రాపిడ్ యాక్షన్ బృందాలను ఏర్పాటు చేశామని, ఈ బృందంలో మండలస్థాయిలోని తహశీల్దార్, ఎంపిడిఒ, రహదారులు, భవనాలు శాఖ, విద్యుత్ శాఖ, పంచాతీరాజ్ శాఖాధికారులు ఉంటారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సోమవారం లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. రైతుల వద్ద మరో పదివేల మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా సేకరించామన్నారు. జిల్లాలో ఎక్కడైనా రైతుల వద్ద ధాన్యం మిగిలిపోతే వెంటనే దగ్గరలోని ఆర్‌బికెలకు తెలియజేస్తే వెంటనే సేకరిస్తారన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, జిల్లా కేంద్ర ఆసుపత్రి సేవల సమన్వయాధికారి పాల్ సతీష్‌కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎ.విజయ, ఆర్ఎంఒ డిఆర్.ప్రసాద్‌రెడ్డి, తహశీల్దార్ సోమశేఖర్ పాల్గొన్నారు.


భోజనం అందిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో యాచకులకు భోజన పొట్లాల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి ఆదేశానుసారం రెడ్‌క్రాస్ వాలంటీర్లు మంగళవారం ఏలూరు రైల్వేస్టేషన్, పాత బస్టాండ్ వంటి ప్రాంతాల్లో 20 మంది యాచకులకు భోజన పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం మాట్లాడుతూ వర్షం కారణంగా భోజనం లేకుండా ఇబ్బంది పడుతున్న యాచకులకు ఛైర్మన్ కృష్ణారెడ్డి ఆదేశాలతో రెడ్‌క్రాస్ వాలంటీర్లు భోజనాలు పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వాలంటీర్లు ఎ.సూర్యనారాయణ, వి.నాగరాజు, కె.శ్రీనివాస్, మహమ్మద్ సుధీర్ పాల్గొన్నారు.

పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి - ముసునూరు

మిచౌంగ్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో పంట పొలాల్లో నీళ్లు నిల్వ లేకుండా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ రైతులకు సూచించారు. మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల వలన పుగాకు, మొక్కజొన్న, మిర్చి, వరి, పత్తి పంట పొలాల్లో నీళ్లు నిల్వ లేకుండా చూసుకోవాలని, అవసరమైతే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కూలీల సహాయ సహకారాలతో నీరు నిల్వ లేకుండా చూసుకుని, తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.

ఉద్యాన రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఉద్యాన రైతులు తుపాను ప్రభావం వల్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్‌డీ షాఫియా ఫర్వీన్ అన్నారు. ఒక ప్రకటనలో ఆమె తెలిపిన వివరాల ప్రకారం అరటి రైతులు తోటలలో నీరు ఎక్కువ నిలువ ఉండకుండా చూడాలన్నారు. యూరియా 100 గ్రాములు, పోటాష్ 80 గ్రాములు మొక్కలో వేయాలని, మొక్కలకి కర్రలు కట్టాలని అన్నారు. బొప్పాయి రైతులు తోటలలో నీరు ఎక్కువ నిలువ ఉండకుండా చూడాలని, కాపర్ ఆక్సీ క్లోరైడ్ లీటర్ నీటికి 3 గ్రాములు వేయాలని, మొక్కలకి కర్రలు కట్టాలని తెలిపారు. కూరగాయలు, మిరప, టమాట పంట రైతులు నీరు నిలువ ఉండకుండా చూడాలని, 1 గ్రామ్ కార్బన్డిజం, సిఒసి ఎ3 గ్రాములు లీటర్ నీటిలో వేసి పిచికారీ చేయాలని సూచించారు.